క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చంద్రగిరి: మెరుగైన విద్యుత్ సరఫరాను అందించాలనే లక్ష్యంతో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు చంద్రగిరి ఏడీఈ శేషారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యలను పరిష్కరించడం కోసం సరఫరాను నిలిపివేస్తామన్నారు. వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

దివ్యాంగుల్లోని ప్రతిభను వెలికితీయాలి



విద్యార్థులకు బహుమతి ప్రదానం

భాకరాపేట: దివ్యాంగుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వెలికి తీయాలని చిన్నగొట్టిగల్లు ఎంఈవో సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు, వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వారికి ఫిజియోథెరపీ, స్పాచ్ థెరపీ, ప్రత్యేక విద్యతోపాటు శిక్షణ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 గోపినాథ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి సత్రాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం దారుణమని, కాంట్రాక్టర్ భాస్కర్‌నాయుడు వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ నేతలు ఎన్‌డీ.రవి, శివకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో టీటీడీ కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం నిర్వహించారు. 54 మంది కార్మిక కుటుంబాలు వీధిన పడకుండా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీటీడీ కాంట్రాక్ట్ కార్మిక సంఘ నేతలు దాక్షాయిని, అరుణ, గంగులమ్మ, గీత, సరిత, వనజ, గీత, శివమ్మ, వెంకరత్నమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తిలో ఈనెల 17, 18, 19వ తేదీల్లో మూడు రోజులపాటు జరగనున్న ఏఐటీయూసీ తిరుపతి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.శివ పిలుపునిచ్చారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం పూలే విగ్రహం వద్ద జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. తిరుపతి నగరంలోనున్న ఆటో కార్మికులందరూ పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆటో యూనియన్ తిరుపతి నగర అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వెంకటేష్, ప్రమీల, పార్వతి, మురుగన్, గోవిందు, మణి కంఠ, సతీష్, శ్రీధర్, వాసు, రఫీ, బాల, నాగరాజు, ఏఐటీయూసీ నేత ఎన్‌డీ.రవి పాల్గొన్నారు.


ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు ఓటు




నారాయణవనంలోని వేదవ్యాస డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఆర్ఐఓ

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు ఓటు అని, 01-01-2024నాటికి 18ఏళ్లు నిండిన పౌరులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఆర్ఐఓ, జిల్లా ఇన్‌స్టిట్యూషనల్ నోడల్ ఆఫీసర్ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఏటీఎస్ డిగ్రీ కళాశాల, నగరిలోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాల, నారాయణవనంలోని వేదవ్యాస డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం ఓటు నమోదుపై 18 ఏళ్లు నిండిన విద్యార్థినీవిద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ ఓటరు నమోదు ప్రక్రియ, దరఖాస్తు చేసుకునే విధానం, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అందుబాటులో ఉన్న వెబ్‌సైట్ వివరాలను వివరించారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు





ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులో వెలసిన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి కార్తీక శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఆలయాన్ని శాస్త్రోక్తంగా శుద్ధి చేసి, పూజలు ప్రారంభించారు. అభిషేకం, అర్చనలు అయిన అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులుకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో లలిత సహస్ర నామాన్ని పఠించారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం



భారీ వర్షాలు కురిసినా కరకంబాడి రోడ్డుపై నిలువని వరదనీరు



కరకంబాడి రోడ్డులో శరవేగంగా కాలువ విస్తరణ పనులు

- ఓర్వలేక 'పచ్చ' పత్రిక విషపు రాతలు
- దశాబ్దాల సమస్యను వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం
- కరకంబాడి రోడ్డు, లక్ష్మీపురం కూడలి ప్రాంతాల్లో రూ.కోట్లతో అభివృద్ధి
- భారీ వర్షానికి రోడ్లపై నీరు ప్రవహించడం సాధారణమే
- గంట వ్యవధిలోనే నగరం దాటిన వర్షపు నీరు

తిరుపతి నగరంలో గత పాలకులు దశాబ్దాలుగా పట్టించుకోని ముంపు సమస్యను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని శాశ్వత పరిష్కారం చూపారు. పట్టణ ప్రాంతాల్లో చిన్న పాటి వర్షం కురిసినా కాలువలు పొంగి ప్రవహించడం సర్వసాధారణం. దశాబ్దాలుగా తిరుపతి నగరంలో అనేక ప్రాంతాలు భారీ వర్షాలకు నీటమునిగి ప్రజలు నరకం అనుభవించిన సందర్భాలు కోకొల్లలు. ఈ సమస్యకు గత పాలకులు శాశ్వత పరిష్కారం చూపక పోవడంతో ఏళ్ల తరబడి లోతట్టు ప్రాంతాల ప్రజలు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.5.20 కోట్లతో కాలువల విస్తరణ చేసి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపింది.

తిరుపతి తుడా: అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తున్నా 'పచ్చ' పత్రికలు వైఎస్‌ఆర్ సీపీపై విషం చిమ్మడం సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీటితో నవోదయకాలనీ, సుబ్బారెడ్డినగర్, కొత్తపల్లి, కొర్లగుంట, సుభాష్‌నగర్, గోవిందనగర్, మాధవ నగర్, అక్కారంపల్లి, ఎర్రమిట్ట ప్రాంతాలు తరచూ ముంపునకు గురవుతున్నాయి. ఈ క్రమంలోనే లీలామహల్ కూడలి నుంచి కరకంబాడి రోడ్డు బొంతాలమ్మ గుడి వరకు కాలువల విస్తరణకు చర్యలు తీసుకున్నారు. దీంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. స్మార్ట్ సిటీ నిధులతో సుమారు కిలోమీటరు పొడవుతో కాలువ విస్తరణకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం లీలామహల్ కూడలి నుంచి లెప్రసీ ఆస్పత్రి గేటు వరకు కాలువ విస్తరణ పనులు పూర్తిచేశారు. మరో 120మీటర్ల పొడవున కాలువను విస్తరించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. గతంలో ఈ కాలువ 1.2మీటర్ల వెడల్పుతో ప్రవహించేది. దీని సామర్థ్యాన్ని మరో 1.2మీటర్లు విస్తరించి మొత్తం 2.4మీటర్లకు పెంచారు. ఇందు కోసం స్మార్ట్ సిటీ నిధుల నుంచి రూ.5.20కోట్లను ఖర్చు చేశారు. కాలువ విస్తరణతో ముంపు ప్రాంత కాలనీలు రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు సమస్యను అధిగమించాయి. గత చరిత్రను విస్మరించి ప్రస్తుత ప్రభుత్వంపై సమస్యను నెట్టే ప్రయత్నం పచ్చ పత్రికలు ప్రయత్నించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్యధిక వర్షపాతం నమోదైనా కరకంబాడి రోడ్డు మార్గంలో గంటల వ్యధిలోనే ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ప్రవాహం నగరం దాటింది.

లక్ష్మీపురం సర్కిల్‌లో కాలువల విస్తరణ

చిన్నపాటి వర్షం పడినా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు ఏఐఆర్ బైపాస్‌రోడ్డు, లక్ష్మీపురం కూడలి పరిసర ప్రాంతాలను ముంచెత్తేది. గత ప్రభుత్వాలు ఈ సమస్యను పట్టించుకోలేదు. వైఎస్‌ఆర్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నగరంలో రోడ్లు, కాలువల విస్తరణ వంటి అభివృద్ధి పనులను శరవేగంగా చేపట్టింది. ఎయిర్ బైపాస్‌రోడ్డు, లక్ష్మీపురం కూడలి మీదుగా 1.5కిలోమీటర్ల పొడవుతో వర్షపు నీటిని నగరం దాటించేందుకు కాలువలను విస్తరించారు. గతంలో రోడ్డుకు ఒక వైపే చిన్నపాటి కాలువ ఉండేది. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా 1.5మీటర్ల వెడల్పుతో కొత్త కాలువలను నిర్మించారు. ఇందుకోసం రూ.2.50 కోట్లు రాష్ట్రప్రభుత్వం, కార్పొరేషన్ నిధులను వెచ్చించాయి. ఇటీవల కురిసిన భారీ వర్షంతో ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు మోతాదుకు మించి ప్రవహించింది. గంటల వ్యవధిలోనే ఈ నీటిని సులువుగా నగరం దాటించగలిగారు.



ఆహ్వానం

టీటీడీ ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో సోమవారం ప్రారంభమయ్యే కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రారంభోత్సవానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రేణూదీక్షిత్, వైద్యులు ఆహ్వానం పలికారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నగర మేయర్ డాక్టర్ శిరీష



స్వాగతం పలుకుతున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత

టెండర్‌ను రద్దు చేయాలని వినతి



వీసీ సుందరవల్లికి వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్వీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల కోసం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న శ్రీనివాస డిటెక్టివ్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్‌కు ఇచ్చిన టెండర్‌ను వెంటనే రద్దు చేయాలని ఎస్వీ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ బండి నాగరాజు డిమాండు చేశారు. శుక్రవారం ఆయన అసోసియేషన్ సభ్యులతో కలసి తాత్కాలిక వీసీ సుందరవల్లిని కలసి వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో తిరిగి నియామకాలు చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సంస్థ టెండర్‌ను రద్దు చేయాలని కోరారు.

వైద్యుల సలహా తప్పనిసరి



ధ్రువపత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపల్, వర్సిటీ అధికారులు

తిరుపతి తుడా: వ్యాధి గ్రస్తులు మందులను వైద్యుల సూచనలు సలహాలతోనే వాడాలని పద్మావతీ మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషాకళావత్ సూచించారు. శుక్రవారం స్విమ్స్‌లోని పద్మావతి మహిళా వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫార్మకోవిజిలెన్స్-మెడికేషన్ సేఫ్టీ అనే అంశంపై ఏడవ వర్క్‌షాప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె డీన్ ఉమా మహేశ్వరరావుతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. రోగులకు చికిత్సను అందించే క్రమంలో డ్రగ్ రియాక్షన్ కొన్ని సందర్భాల్లో సంభవిస్తుంటుందన్నారు. మరి కొంతమంది రోగులు డాక్టర్ల సలహాలను పాటించకుండా సరైన మోతాదులో మందులను తీసుకోకపోవడంతోనే రియాక్షన్ వస్తుంటుందన్నారు. ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందచేశారు. ఫార్మ కాలజీ విభాగం క్లినికల్ ఫార్మాసిస్టు సుచిత్ర, ఫార్మ కాలజీ విభాగం వైద్యులు, వివిధ ఫార్మసీ కళాశాలలకు చెందిన విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గౌడ కుటుంబీకుల కార్తీక వన సమారాధన



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

తిరుపతి కల్చరల్: ఏపీ గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం, తిరుపతి జిల్లా గౌడ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తొండవాడ, ముక్కోటి వద్దనున్న పీఎల్ఆర్ కల్యాణ మండపంలో కార్తీక వన సమారాధన చేపడుతున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.కుమారస్వామి తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ కార్తీక వన సమారాధనకు ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ కేజే శాంతికుమార్, ప్రముఖ బీసీ తత్వవేత్త నారగోని వెంకటయ్య, జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటనారాయణ, హైకోర్టు న్యాయవాది లక్ష్మీశైలజ, రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్ గౌరవ అతిథులుగా హాజరవుతారని తెలిపారు. గౌడ సంఘం నేతలు తుమ్మల చెంగయ్య గౌడ్, మునిశేఖర్ గౌడ్, మల్లికార్జున గౌడ్, బాలకృష్ణ, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటు నమోదు, ఓటు తప్పులు సవరణ చేసుకుంటున్న ఆర్యవైశ్యులు

తిరుపతి కల్చరల్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఓటరు నమోదు అదనపు అధికారి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, మున్సిపల్ డెప్యూటీ కమిషనర్ చంద్రమౌళిరెడ్డి పిలుపు నిచ్చారు. ఆర్య వైశ్య సంఘం విజ్ఞప్తి మేరకు శుక్రవారం కొత్తవీధిలోని ఆర్యవైశ్య సంఘ కార్యాలయంలో ఓటరు నమోదు, ఓటరు తప్పులు సవరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు మాట్లాడుతూ సంఘం విజ్ఞప్తి మేరకు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి శ్రీధర్, వెంకటేష్ గుప్తా, హేమచంద్రకుమార్, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

28న బ్రాహ్మణ వివాహ వేదిక

తిరుపతి కల్చరల్: అఖిల భారత బ్రాహ్మణా కల్యాణోపాధ్యాయ వివాహ సమాచార కేంద్రాల సంఘం, శ్రీవెంకట గాయత్రి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 2024 జనవరి 28వ తేదీన తిరుపతిలో అఖిల భారత స్థాయిలో బ్రాహ్మణ వధూవరుల వివాహ వేదిక, సామూహిక షష్టిపూర్తి, భీమరథ శాంతి, సహస్ర చంద్రదర్శనం, శాంతి హోమం నిర్వహిస్తున్నట్లు తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సీఆర్‌కే శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. గత 20 ఏళ్లుగా బ్రాహ్మణ వివాహ వేదికతోపాటు 60 ఏళ్లు నిండిన వారికి షష్టిపూర్తి, 70 ఏళ్లు నిండిన వారికి భీమరథ శాంతి, 80 ఏళ్లు నిండిన వారికి సహస్ర చంద్రదర్శనం, శాంతి హోమం ఉచితంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు తిరుపతి ఇస్కాన్ రోడ్డులోని వినాయక నగర్ వద్దనున్న కంచి పాదుక మండపంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనదలిచిన బ్రాహ్మణులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 94402 71154, 92478 44224, 63011 92026 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లు



తిరుపతి అర్బన్: అర్బన్ ప్రాంతంలో 22ఏ జాబితా నుంచి భూములను తొలగించడానికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డితోపాటు డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్న విషయం తెలిసిందే. కార్పొరేషన్ పరిధి, 11వ డివిజన్ పరిధిలోని భూములపై ఉన్న 22 నిషేధాన్ని ప్రభుత్వం తొలగించడంతో స్థానిక కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికా రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి కార్పొరేటర్ల ద్వారా సాక్షి సంతకాలు చేయించి, రిజిస్ట్రేషన్ చేయించారు. వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వంపై మరింత నమ్మకాన్ని కలిగించారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, నరసింహాచారి, కార్పొరేటర్ సంధ్య, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, గోపి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ నూతన కమిటీ ఎంపిక

తిరుపతి కల్చరల్: ఆమ్‌ఆద్మీ పార్టీ నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటాచలపతి తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన నూతన కమిటీని ప్రకటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిరుపతికి చెందిన బాలసుబ్రమణ్యం, సభ్యురాలిగా నందినిని నియమించినట్లు తెలిపారు. అలాగే తిరుపతి, చంద్రగిరి నియోజవర్గం కన్వీనర్లుగా రాజేష్ రాయల్, లోకేష్ కుమార్‌రెడ్డిని ఎంపిక చేశామన్నారు. ఎంపికైన వారికి ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు నీరుగట్టు నగేష్, ఎం.శేఖర్, నందిని, చందు, విక్రమ్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

11,486 దళితుల ఓట్ల తొలగింపునకు కుట్ర

- చంద్రగిరిలో వేలాదిగా ఫారం-7తో దొంగ దరఖాస్తులు ఇచ్చిన టీడీపీ
- గతంలో ఓటేసేందుకు దళితులను పోలింగ్ కేంద్రానికి రానీయని పచ్చనేతలు
- ఇప్పుడు భారీ సంఖ్యలో దళితుల ఓట్ల తొలగింపునకు తెగబడ్డ వైనం
- కుట్రపై ఆధారాలతో ఎన్నికల కమిషన్‌కు, సైబర్‌క్రైంకు ఇస్తున్నాం
- కుట్రదారులను అరెస్టు చేయకపోతే దళితులంతా ఆమరణ దీక్షకు సిద్ధం
- హెచ్చరించిన దళిత ప్రజాప్రతినిధులు

తిరుపతి రూరల్: గతంలో దశాబ్దాలుగా చంద్రగిరి నియోజకవర్గంలో దళితులను ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి సైతం రానీయకుండా అడ్డుకున్న టీడీపీ ఇప్పుడు ఏకంగా వారి ఓట్లే లేకుండా చేసేందుకు తెగబడిందని దళిత ప్రజా ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఐదు రోజుల్లో చంద్రగిరి నియోజకవర్గంలోని 11,486 దళితుల ఓట్లను తొలగించమని ఫారం-7లతో దరఖాస్తు చేశారని వారు ఆరోపించారు. తప్పుడు చిరునామాలు, ఫోన్ నెంబర్లతో ఎక్కడెక్కడో కూర్చుని వేలాదిగా దొంగ ఫారం-7లు పెట్టారని పేర్కొన్నారు. ఓట్ల తొలగింపునకు ప్రయత్నించిన వారెవరు, వారి వెనుక ఉన్నవారవరు అనే సమాచారాన్ని తాము ఇప్పటికే కొంతవరకు సేకరించామని తెలిపారు. ఈ సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు, జిల్లా కలెక్టర్‌కు, సైబర్ క్రైమ్‌కు ఇస్తున్నట్లు తెలిపారు. దొంగ ఫారం-7ల ద్వారా దళితుల ఓట్ల తొలగింపు కుట్ర వెనుక ఉన్న మిగిలిన వారిని, అసలు సూత్రధారులను సైబర్‌క్రైమ్ ద్వారా మరిన్ని ఆధారాలతో గుర్తించి, దళితద్రోహులను అరెస్టు చేయాలని విన్నవించారు.

ఆమరణ దీక్షకు సైతం సిద్ధం

11486 మంది దళితుల ఓట్ల తొలగింపునకు ప్రత్యక్షంగా ప్రయత్నించిన వారిపై, పరోక్షంగా ప్రేరేపించి కుట్రదారులపై చట్టపరమైన తీసుకోవాలని చంద్రగిరి దళిత ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. లేకుంటే నియోజకవర్గంలోని దళితులంతా ఏకమై తమ హక్కులను కాపాడుకునేందుకు టీడీపీకి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆమరణ దీక్షకు పూనుకోవడానికి సైతం వెనకాడబోమని హెచ్చరించారు.

11 నుంచి గడపగడపకు..

- హాజరుకానున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ బాలాజీ నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హాజరు కానున్నారన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఎంపీడీఓ బాలాజీ నాయక్ కోరారు.

11వ తేదీ ఉదయం 9 గంటలకు మండల పరిధిలోని పనపాకం పంచాయతీ అరిగెలవారిల్లిలో ప్రారంభం అవుతుంది, 12వ తేదీ కూడా పనపాకం పంచాయతీలో కొనసాగుతుంది. 13న కల్‌రోడ్డుపల్లి, ఎం.కొంగరవారిపల్లి, 14న ముంగిలిపట్టు, ఎం.కొత్తపల్లి, మామండూరు, 15న ఐతేపల్లి, పులిత్తివారిపల్లి, 16న ఏజీ పల్లి, అగరాల, 18న గంగుడుపల్లి, దోర్నకంబాల, 19న కొటాల, రంగంపేట, 20న బందార్లపల్లి, పుల్లయ్యగారిపల్లి, రామిరెడ్డిపల్లి, 21న మిట్టపాళెం, నరసింగాపురం, 22న రెడ్డివారిపల్లి, బుచ్చినాయుడుపల్లి, 23న తొండవాడ, 26న శానంభట్ల, పిచ్చినాయుడుపల్లి, 27న రాయలపురం, 28న భీమవరం, 29న కొండ్రెడ్డి కండ్రిగ, కందులవారిపల్లి, 30న శేషాపురం, బి.కొంగరవారిపల్లి, జనవరి 2వ తేదీన చంద్రగిరిలో నిర్వహించనున్నారు.

ఆవిష్కరణ



31వ డివిజన్ సచివాలయం పరిధిలో వైఎస్ ఆర్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సీకే రేవతి, నాయకులు



19వ వార్డు బైరాగిపట్టెడ తుడా కాంప్లెక్స్ సచివాలయంలో పనుల బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సంధ్య, వైఎస్ఆర్ సీపీ నేతలు









శ్రీవారిని దర్శించుకున్న మహారాష్ట్ర మంత్రి సుధీర్ ముంగంటివార్, తెలంగాణ టిఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, సినీనటి సంగీత

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శుక్రవారం మహారాష్ట్ర మంత్రి సుధీర్ ముంగంటివార్, తెలంగాణ టీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, సినీనటి సంగీత వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.